క్లుప్తంగా

సన్మానం



ఉద్యోగులను సన్మానిస్తున్న సిబ్బంది

తెర్లాం: మండలంలోని ఆమిటి గ్రామ సచివాలయంలో పనిచేస్తూ ఇటీవల జరిగిన బదిలీల్లో వేరే ప్రాంతాలకు వెళ్లిన ముగ్గురు ఉద్యోగులను తోటి సిబ్బంది శుక్రవారం సన్మానించారు. పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న చింతల సత్యనారాయణతో పాటు వీఆర్వో, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లకు బదిలీ కాగా, వారిని కవిరాయునివలస పంచాయతీ కార్యదర్శి వి.హరి, సచివాలయ సిబ్బంది దుశ్శాలువాలతో సత్కరించారు. ఎక్కడ పనిచేసినా మంచి పేరు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు.

సెలవుల్లో పాఠశాలలు తెరవొద్దు



రాజాంలో ఓ ప్రైవేటు పాఠశాల యాజమాన్యంతో సమావేశమైన ఎంఈవో దుర్గారావు

రాజాం: దసరా సెలవుల్లో పాఠశాలలు తెరవవద్దని ఎంఈవో యాగాటి దుర్గారావు సూచించారు. మండల కేంద్రంలోని పలు ప్రైవేటు పాఠశాలలను శుక్రవారం సందర్శించిన ఆయన.. అక్కడి యాజమాన్యానికి పలు సూచనలు చేశారు. కొన్నిచోట్ల సెలవుల్లో కూడా పాఠశాలలు తెరిచి, తరగతులు నిర్వహిస్తున్నట్లు సమాచారం తెలియస్తోందని, ఈ నేపథ్యంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. సెలవు రోజుల్లో ఎక్కడైనా పాఠశాలలు తెరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

రూ.5.13 కోట్ల నిధుల మంజూరు



మాట్లాడుతున్న పంచాయతీరాజ్ ఏఈ రమేష్

రామభద్రపురం: మండలంలో ఉపాధి హామీ పథకం నిధుల ద్వారా చేపట్టనున్న 80 పనులకు గాను రూ.5.13 కోట్ల నిధులు మంజూరయ్యాయని పంచాయతీరాజ్ ఏఈ రమేష్ తెలిపారు. శుక్రవారం బాధ్యతలు స్వీకరించిన అనంతరం మీడియాతో ఆయన మాట్లాడుతూ గ్రామాల్లోని రోడ్లు, కాలువలు, కల్వర్టులు వంటి నిర్మాణాలు చేపట్టనున్నామన్నారు. ప్రస్తుతం మంజూరైన పనులకు సంబంధించి, త్వరలో అంచనాలు రూపొందిస్తామన్నారు. నిర్మాణాల్లో నాణ్యత ఉండేలా జాగ్రత్త వహిస్తామని, 2025 మార్చిలోగా పనుల పూర్తికి చర్యలు తీసుకుంటామన్నారు.

బాధ్యతల స్వీకరణ



ఎంపీపీని కలిసిన ఎంపీడీవో కూర్మనాథ్ పట్నాయక్

మెంటాడ: ఎంపీడీవోగా కూర్మనాథ్ పట్నాయక్, ఏవోగా భానుమూర్తిలు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఎంపీపీ రెడ్డి సన్యాసినాయుడును మర్యాదపూర్వకంగా కలిసి, మండల అభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు.

బాడంగి: మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో ఏపీఎం(అసిస్టెంట్ ప్రోగ్రామింగ్ ఆఫీసర్)గా ఎ.రత్నకుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఏపీవోగా పనిచేసిన పి.భాగ్యలక్ష్మి బొబ్బిలి బదిలీ అయ్యారు. ఇదిలా ఉండగా, మండల రెవెన్యూ కార్యాలయంలో హెచ్‌డీటీగా ఆర్.ధనం పదవీ బాధ్యతలు చేపట్టారు.

పారాది వంతెన పనుల పునఃప్రారంభం



నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బేబీనాయన

బొబ్బిలిరూరల్: మండలంలోని పారాది గ్రామం వద్ద వంతెన నిర్మాణ పనులను శుక్రవారం పునఃప్రారంభించారు. టెంకాయ కొట్టి, రెండో పిల్లర్‌కు కాంక్రీట్ వేసే పనులను ఎమ్మెల్యే బేబీనాయన ఆరంభించారు. మొత్తం రూ.13.40 కోట్ల వ్యయంతో ఈ నిర్మాణం చేపడుతున్నారు. అయితే గతంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలోనే ఈ వంతెన పనులు ప్రారంభమై, నిర్మాణానికి రూ.10.40 కోట్లు కూడా మంజూరు చేయడం జరిగింది. ఆంధ్రా–ఒడిశా రాష్ట్రాల ప్రజల రాకపోకలకు ఈ వంతెన ప్రధాన ఆధారం కాగా ప్రస్తుతం ఎవరికీ ఏ సమాచారం ఇవ్వకుండా రహస్యంగా వంతెన పనులు పునఃప్రారంభించడం పట్ల సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ప్రజాసమస్యలను పరిష్కరించండి

రామభద్రపురం: ప్రజాసమస్యల పరిష్కారానికి పాటుపడాలని ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు సూచించారు. మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ లక్ష్మణరావును ఎంపీడీవో ఎం.రత్నం మర్యాదపూర్వకంగా శుక్రవారం కలిశారు. ప్రజాప్రతినిధులు, అధికారుల సమన్వయంతో గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, తద్వారా మండల అభివృద్ధికి కృషి చేయాలని ఎంపీపీ కోరారు. ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కారమయ్యేలా చూస్తూ, అభివృద్ధి జరిగేలా చూస్తానన్నారు.

దుర్గమ్మా.. కరుణించు!



బొబ్బిలిరూరల్: అలజంగిలో గాయత్రీదేవి అవతారంలో దుర్గామాత



రామభద్రపురం కూరాకుల వీధిలో భక్తుల పూజలు



తెర్లాం: నందబలగలో పూజలందుకుంటున్న దుర్గాదేవి



రాజాం: మండల కేంద్రంలోని గాయత్రీదేవి ఆలయంలో కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు



బాడంగి: మండల కేంద్రంలోని ఉమాసోమేశ్వరాలయంలో గాయత్రీదేవిగా దుర్గమ్మ దర్శనం



రాజాం సిటీ బస్టాండ్ ఆవరణలో నవదుర్గామాత ఆలయంలో పూజలందుకుంటున్న అమ్మవారు



రేగిడి: సంకిలిలో దుర్గతల్లికి పూజలు చేస్తున్న భక్తులు

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలతో అంతటా పండగ వాతావరణం నెలకొంది. రోజుకో అవతారంలో దర్శనమిచ్చే దుర్గమ్మను చూసి తరించేందుకు భక్తులు పోటెత్తుతున్నారు. శుక్రవారం గాయత్రీదేవి అలంకరణలోని దుర్గామాతను భక్తులు దర్శించుకుని, ప్రత్యేక పూజలు, హోమాలు చేశారు. దుర్గమ్మా.. కరుణించు అని వేడుకున్నారు. పలుచోట్ల చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. –బొబ్బిలి, రాజాం



బొబ్బిలిరూరల్: దుర్గాదేవి మండపం ఆవరణలో పూజలు చేస్తున్న భక్తులు



సంతకవిటిలోని తెలగ వీధిలో ఏర్పాటు చేసిన దుర్గమ్మ మండపం

గంజాయి రవాణాపై ఉక్కుపాదం

- బొబ్బిలి, చీపురుపల్లి డీఎస్పీలు శ్రీనివాసరావు, రాఘవులు



తెర్లాం పోలీస్‌స్టేషన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు



వంగర: లక్ష్మీపేటలోని ప్రత్యేక న్యాయస్థానాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ రాఘవులు

తెర్లాం: గంజాయి రవాణాపై ఉక్కుపాదం మోపుతున్నామని, ఆ దిశగా కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్నామని బొబ్బిలి డీఎస్పీ శ్రీనివాసరావు అన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌ను శుక్రవారం సందర్శించిన ఆయన.. స్టేషన్ పరిసరాలు, రికార్డులను పరిశీలించారు. కేసుల నమోదు వివరాలను ఎస్‌ఐ సాగర్‌బాబును అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గంజాయి తరలించినా, విక్రయించినా, వాడినా చట్టరీత్యా నేరమని, పట్టుబడిన వారిపై కఠిన చర్యలకు వెనుకాడేది లేదన్నారు. ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించి, రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలని కోరారు. ప్రస్తుతం యువత చెడు వ్యవసనాలకు బానిసలై తమ బంగారు భవిష్యత్ నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులు, యువత అంతా దురలవాట్లకు దూరంగా ఉండాలని తెలిపారు. యువతలో మంచి నడవడికకు ఎస్పీ వకుల్ జిందాల్ సంకల్పం పేరిట ఓ కార్యక్రమం ప్రారంభించారని, ఆ కార్యక్రమం ద్వారా యువతను చైతన్యం చేయడం జరుగుతోందన్నారు. ఇక్కడి పోలీస్ సిబ్బంది పనితీరు సంతృప్తికరంగా ఉందని డీఎస్పీ మెచ్చుకున్నారు. ఆయన వెంట బొబ్బిలి రూరల్ సీఐ నారాయణరావు తదితరులు ఉన్నారు.

వంగర: మండలంలోని లక్ష్మీపేట గ్రామంలో ఉన్న ప్రత్యేక న్యాయస్థానాన్ని చీపురుపల్లి డీఎస్పీ ఎస్.రాఘవులు శుక్రవారం పరిశీలించారు. అనంతరం వంగర పోలీస్‌స్టేషన్‌ను సందర్శించి, సిబ్బంది పనితీరు, రికార్డులు, కేసుల వివరాలు గమనించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గంజాయి రవాణా జరగకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. యువత మత్తుపదార్థాల బారినపడి తమ జీవితాలు నాశనం చేసుకుంటున్నారని, డ్రగ్స్‌కు దూరంగా ఉండి, మంచి పౌరులుగా నిలవాలని ఆకాంక్షించారు. నేరాల నియంత్రణకు శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తున్నామన్నారు. ఆయన వెంట రాజాం రూరల్ సీఐ ఉపేంద్రరావు, ఎస్‌ఐ షేక్ శంకర్ తదితరులు ఉన్నారు.

ఆరోగ్య తనిఖీలు



వైద్యసేవలందిస్తున్న వైద్యాధికారి కిరణ్‌కుమార్

రాజాం సిటీ: మండల పరిధిలోని తిమ్మయ్యపేటలో శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించి, శిబిరానికి హాజరైన వారికి వైద్యులు ఆరోగ్య తనిఖీలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేసి, ఆరోగ్య సూత్రాలు తెలిపారు. ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. ఆదర్శనగర్ అర్బన్ పీహెచ్‌సీ వైద్యాధికారి కిరణ్‌కుమార్ మాట్లాడుతూ పీహెచ్‌సీలో 64 రకాల రక్తపరీక్షలు చేయడం జరుగుతుందని, అలాగే అవసరమైన మందులు అందుబాటులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ఆప్తాలమిక్ అధికారి సప్పటి వసంతరావు, ఎల్‌టీ సింహాచలం, ఆరోగ్య కార్యకర్త ఉమ, ఆశ కార్యకర్త ఇందిర, నిర్మల, అంగన్వాడీ కార్యకర్త లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

'మత్తు'తో జీవితం చిత్తు



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ అశోక్‌కుమార్

రాజాం సిటీ: మత్తు పదార్థాలతో జీవితం చిత్తు అవుతుందని, వాటి బారినపడి భవిష్యత్ నాశనం చేసుకోవద్దని సీఐ కె.అశోక్‌కుమార్ తెలిపారు. స్థానిక శ్రీచైతన్య కళాశాలలో సంకల్పం కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు సత్ప్రవర్తన, మంచి నడవడికపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ఇంటర్మీడియట్ చదివే వయసులో యువత ఎక్కువగా దురలవాట్లకు లోనై తమ బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థి దశ నుంచే చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, చక్కగా చదువుకుని సద్బుద్ధితో మెలగాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ నర్సింహమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి' పనులపై చర్చ



రేగిడి: లక్ష్మీపురం గ్రామసభకు హాజరైన వేతనదారులు, ఉపాధి హామీ పథకం సిబ్బంది

రాజాం: మండలంలోని రాజయ్యపేట గ్రామంలో గ్రామసభ శుక్రవారం నిర్వహించి, 2025–26 ఆర్థిక సంవత్సరానికి గాను చేపట్టాల్సిన ఉపాధి హామీ పథకం పనులపై చర్చించారు. రైతులకు ఉపయోగపడేలా వేతనదారులు కోరిన చోట పనులు చేపట్టేందుకు అందరూ తీర్మానించారు. కార్యక్రమంలో ఏపీవో సాయిరాం పాల్గొన్నారు.

రేగిడి: మండలంలోని లక్ష్మీపురం గ్రామంలో ఉపాధి హామీ పథకం పనులకు సంబంధించి, శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. ఎక్కడ పనులు చేపట్టాలన్న అంశంపై వేతనదారులు, రైతులు చర్చించారు. గ్రామసభ తీర్మానం అనంతరం పనులు చేపట్టనున్నామని ఏపీవో హరనాథరావు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ కెంబూరి తేజోవతి, పంచాయతీ కార్యదర్శి జగదాంబ పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

శ్రీరాముడిని తాకిన సూర్యకిరణాలు



బొబ్బిలిరూరల్: మండలంలోని దిబ్బగుడ్డివలస రామమందిరంలో కొలువైన శ్రీరాముడిని సూర్యకిరణాలు శుక్రవారం తాకాయి. ఈ అద్భుత దృశ్యాన్ని తిలకించేందుకు భక్తులు ఆలయానికి పోటెత్తారు. రామనామం జపిస్తూ భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

నూతన వ్యవసాయ పద్ధతులపై అవగాహన

రేగిడి: మండలంలోని అంబకండి గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం శుక్రవారం నిర్వహించి, నూతన వ్యవసాయ పద్ధతులు, పంటలకు సోకే తెగుళ్లు, చీడపీడల నివారణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. ఏవో మురళీకృష్ణ మాట్లాడుతూ ప్రతీ రైతు వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తల సూచనలు, సలహాలు పాటిస్తూ సాగు చేస్తే అధిక దిగుబడులు వస్తాయని తెలిపారు. రసాయనిక ఎరువుల వినియోగం తగ్గించి, సేంద్రియ ఎరువులను వినియోగించాలని సూచించారు. కార్యక్రమంలో వీఏఏ కె.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల సీజ్



పట్టుబడిన ఇసుక ట్రాక్టర్

సంతకవిటి: మండలంలోని జావాం, చిత్తారపురం గ్రామాల్లోని నాగావళి నదీతీరం నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకుని సీజ్ చేసినట్లు ఎస్‌ఐ ఆర్.గోపాలరావు శుక్రవారం తెలిపారు. మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ట్రాక్టర్లను పట్టుకున్నామని, వాహన యజమానులపై కేసు నమోదు చేశామన్నారు.

వంగర: మండలంలోని తలగాం గ్రామ సమీపంలో ఉన్న నాగావళి నది నుంచి అక్రమంగా తరలిస్తున్న ఇసుక లారీని సీజ్ చేసినట్లు ఎస్‌ఐ షేక్ శంకర్ తెలిపారు. గురువారం అర్ధరాత్రి సమయంలో ఇసుక తరలింపుపై పోలీసులకు సమాచారం అందడంతో తలగాం వద్ద కాపుకాసి లారీని పట్టుకుని సీజ్ చేశారు.

సస్యరక్షణ చేపట్టాలి



రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు చిట్టిబాబు, స్వాతి

తెర్లాం: మెట్టుభూముల్లో సాగు చేస్తున్న గోగు పంటలో సస్యరక్షణ చర్యలు చేపడితే పంట ఏపుగా పెరిగి, గోగునార నాణ్యత బాగుంటుందని ఆమదాలవలస వ్యవసాయ పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ చిట్టిబాబు, డాక్టర్ స్వాతి తెలిపారు. మండలంలోని ఆమిటి రైతుసేవా కేంద్రాన్ని వారు శుక్రవారం సందర్శించారు. అనంతరం గ్రామంలో రైతులు సాగు చేస్తున్న గోగు పంటను పరిశీలించి, పలు సూచనలు చేశారు. గోగు పంటను తీసేసిన తర్వాత ఊరబెట్టడం, గోగునార తీత వంటి వాటిపై రైతులకు సలహాలు, సూచనలు చేశారు.

ఇంటింటా ఫీవర్ సర్వే



వన్నలిలో రక్తనమూనాలు సేకరిస్తున్న సిబ్బంది

రేగిడి: మండలంలోని వన్నలి, అక్కన్నఅగ్రహారం, గుళ్లపాడు, ఉప్పర్నాయుడువలస, చాటాయివలస తదితర గ్రామాల్లో ఇంటింటా ఫీవర్ సర్వే శుక్రవారం చేపట్టారు. ఆయా గ్రామాల్లోని చాలామంది తీవ్ర అస్వస్థతతో బాధపడుతున్న నేపథ్యంలో ఎవరు ఏ జ్వరంతో ఇబ్బంది పడుతున్నారోనని తెలుసుకునేందుకు రక్తనమూనాలు సేకరించారు. అనంతరం వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటిస్తూ ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రతిరోజూ పౌష్టికాహారం తీసుకోవాలని వైద్యారోగ్య సిబ్బంది సూచించారు. కార్యక్రమంలో రేగిడి, బూరాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యారోగ్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

చెట్లకొమ్మల తొలగింపు

సంతకవిటి: మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ వైర్లకు అడ్డుగా ఉన్న చెట్లకొమ్మల తొలగింపు శుక్రవారం చేపట్టారు. విద్యుత్ వైర్లకు కొమ్మలు తాకుతున్న కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతున్నందున కొమ్మలు తొలగించామని ఏఈ వినయ్‌కుమార్ తెలిపారు.

వీల్‌చైర్ వితరణ



వీల్‌చైర్ అందిస్తున్న వైస్ ఎంపీపీ జగన్మోహనరావు

రేగిడి: మండలంలోని బూరాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి అదే గ్రామానికి చెందిన వైస్ ఎంపీపీ వావిలపల్లి జగన్మోహనరావు, ఆయన సోదరులు కలిసి వీల్‌చైర్ శుక్రవారం వితరణ చేశారు. వారు తమ తండ్రి వావిలపల్లి బంగారునాయుడు పేరిట ఈ వీల్‌చైర్ అందించినట్లు తెలిపారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు వీల్‌చైర్ ఉపయోగపడుతుందన్న సదుద్దేశ్యంతో అందించామన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి చలం తదితరులు పాల్గొన్నారు.

జిల్లా పరిషత్ నిధులు తెచ్చి, వెచ్చించాం..



మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యుడు రామారావు

బాడంగి: మండల అభివృద్ధికి గత రెండేళ్లలో జిల్లా పరిషత్ నుంచి తమ వాటా నిధులు తెప్పించి, వెచ్చించామని జెడ్పీటీసీ సభ్యుడు పెద్దింటి రామారావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలోని ఎంపీపీ చాంబర్‌లో శుక్రవారం విలేకరులతో మాట్లాడిన ఆయన.. జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడుల ఆశీస్సులతో మండల ప్రజలకు సేవ చేసుకునే భాగ్యం వచ్చిందని, గత ప్రభుత్వ హయాంలో మండలంలో పలు అభివృద్ధి పనులకు నిధులు తీసుకువచ్చి, అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. వైఎస్సార్ సీపీ హయాంలో రెండేళ్లలో మండలానికి మంజూరైన రూ.1.89 కోట్ల నిధుల్లో రూ.50 లక్షలతో గ్రావెల్ రోడ్లు, మరో రూ.50 లక్షలతో సీసీ రోడ్లు, మరో రూ.50 లక్షల వ్యయంతో గురుకుల పాఠశాలకు ఇన్వర్టర్ల సదుపాయం కల్పించామన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలోని కొత్త ప్రభుత్వం ద్వారా నిధులు వస్తే మండల అభివృద్ధికి ఖర్చు చేస్తామన్నారు. ఆయన వెంట సచివాలయ కన్వీనర్లు తెర్లి శ్రీనివాసరావు, తెంటు సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా



ఆర్డీవో రామ్మోహనరావుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న రెవెన్యూ సిబ్బంది

బొబ్బిలి: డివిజన్ పరిధిలోని రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆర్డీవో వీఎస్ఎస్ రామ్మోహనరావు అన్నారు. మండల కేంద్రంలోని ఆయన కార్యాలయంలో బొబ్బిలి రెవెన్యూ డివిజన్ పరిధిలోని తహసీల్దార్లు, ఇతర అధికారులంతా ఆయనను శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి, రెవెన్యూ సమస్యలు–వాటి పరిష్కారంపై చర్చించారు. 22ఏలో పడ్డ భూములను ప్రాధాన్యతాక్రమంలో సరిదిద్దుతామన్నారు. ఆర్డీవోను కలిసిన వారిలో మెంటాడ, కోరాడ, తెర్లాం, బాడంగి, గజపతినగరం తహసీల్దార్లు కోరాడ శ్రీనివాసరావు, జి.హేమంత్‌కుమార్, కె.సుధాకర్, బి.రత్నకుమార్, బొబ్బిలి పీఆర్ డీఈఈ అప్పారావు ఉన్నారు.

వివాదాస్పద భూములపై విచారణ



రైతుల వద్ద నుంచి వివరాలు అడిగి తెలుసుకుంటున్న తహసీల్దారు శ్రీను

బొబ్బిలిరూరల్: మండలంలోని డొంగురువలస పంచాయతీ పరిధి, సర్వే నంబరు 75లోని 130 ఎకరాల వివాదాస్పద భూములకు సంబంధించి, తహసీల్దారు ఎం.శ్రీను శుక్రవారం విచారణ చేపట్టారు. గత 40 ఏళ్లుగా ఈ భూమిని సాగు చేస్తున్న పారాది గ్రామానికి చెందిన దళిత రైతులతో పాటు కాశిందొరవలస, డొంగురువలస గ్రామ రైతులకు అప్పటి రెవెన్యూ అధికారులు పట్టాలు ఇవ్వడంతో వివాదం ముదురుకుంది. పారాది గ్రామ రైతుల్లో చాలామంది ఈ భూమిని విక్రయించారని, అయితే ఆ భూమి కొనుగోలుదారులు తమపై దౌర్జన్యానికి పాల్పడుతున్నారని కాశిందొరవలస, డొంగురువలస తదితర గ్రామాలకు చెందిన 90 మంది రైతులు తహసీల్దారుకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు తహసీల్దారు ఆయా గ్రామాల రైతులను కలిసి వారి భూమి వివరాలు తెలిపే పట్టాలను పరిశీలించారు. తరతరాలుగా ఇదే భూమిని సాగు చేసుకుని, కుటుంబాన్ని పోషించుకుంటున్నామని తమకు న్యాయం చేయాలని రైతులు విజ్ఞప్తి చేశారు. రెండు వారాల్లో సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తహసీల్దారు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆర్‌ఐ కల్యాణచక్రవర్తి, సర్వేయర్ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



రాజాం: గర్భిణులకు సీమంతం చేస్తున్న అధికారులు

రాజాం: పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యమని, ప్రతిఒక్కరూ తమ రోజువారీ ఆహారంలో పౌష్టికాహారం ఉండేలా చూసుకోవాలని తహసీల్దారు ఎస్.కె.రాజు అన్నారు. మండలంలోని పొగిరి గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహారం, దాని ప్రయోజనాలపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పంపిణీ చేస్తున్న పౌష్టికాహార పదార్థాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం గర్భిణులకు సీమంతం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈవో బి.ప్రవీణ్‌కుమార్, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రేగిడి: మండలంలోని లచ్చారాయపురం గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులంతా అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ఇస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకుని, సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ శశికళ తెలిపారు. అనంతరం పౌష్టికాహార ప్రదర్శన చేపట్టారు.

ఎస్సీ, ఎస్టీలకు మద్యం దుకాణాలు కేటాయించాలి

బొబ్బిలి: కల్లుగీత కార్మికులకు కేటాయించిన మాదిరిగానే ఎస్సీ, ఎస్టీలకు కూడా మద్యం దుకాణాలు కేటాయించాలని అంబేడ్కర్ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు సోరు సాంబయ్య డిమాండ్ చేశారు. ఇదే విషయమై శుక్రవారం విలేకరులతో మాట్లాడిన ఆయన.. ఆర్థికంగా, సామాజికంగా వెనకబడిన ఎస్సీ, ఎస్టీలకు మద్యంషాపులు ఇవ్వడం ద్వారా వారు ఆర్థికంగా వృద్ధి చెందే అవకాశం ఉందన్నారు. అలాగే ఎస్సీ, ఎస్టీలకు షాపుల లైసెన్స్ రూ.50 వేలకు మించకుండా చూడాలన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

రామభద్రపురం: మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం శనివారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఎం.రత్నం ఓ ప్రకటనలో శుక్రవారం తెలిపారు. ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీటీసీ సభ్యులు, మండల స్థాయి అధికారులంతా హాజరు కావాలని కోరారు.